డిటెక్టివ్ కథల పోటీలో మొదటి బహుమతి రు. 500/- పొందిన కథ

# చిదంబర రహస్యం

కె. శ్రీఉదయిని

**తలుపు తీసుకుని బయటకు వచ్చాడు అతను. ఎవరైనా తనను గమనిస్తున్నారా అన్నట్లు అటూ యిటూ చూశాడు ఓ నిముషంపాటు. ఆ తరువాత ముందుకి నడవబోతూ గోడకి ఉన్న నేమ్‌ప్లేట్‌ని చూసి ఆగిపోయాడు. అందులో**

ప్రొఫెసర్ చిదంబరరావు యం.ఏ., పి.హెచ్.డి అనే కాక కుడిపక్క కిందుగా 'ఇన్' అని వుంది. దాన్ని 'అవుట్'గా మారుద్దామని కదిలిన అతని చెయ్యి మధ్యలోనే సంశయంతో ఆగిపోయింది.

కొన్ని క్షణాలు గడ్డాన్ని సవరించుకుంటూ తటపటాయిస్తూ గడిపాడు. చిదంబరరావు అవుట్ అని కదిలీకదలని పెదవులతో ఉచ్చరిస్తుంటే ఎందుకనో అతని మొహంలో చిరునవ్వు మెరిసింది. దాంతో ఒక్కపాటున నేమ్‌ప్లేట్‌లో అవుట్‌గా మార్చి పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ కదిలాడు.

కాంపౌండ్ వాల్‌కున్న ఇనపగేట్‌ను అతను తోస్తుంటే అది పెద్దగా శబ్దం చేసింది. రోడ్డుమీద పోతున్న యిద్దరూ, ఎదురుగా వున్న పాన్ షాపులోని శాపతను అతని వంక చూశారు. శాపతను అయితే అతను తన షాపువరకూ నడిచి వచ్చేంతవరకూ అలా చూస్తుండిపోయాడు- మారువేషంలో వస్తున్న మాజీ ముఖ్యమంత్రిని చూస్తున్నట్లు కన్నార్పకుండా!

కాషాయరంగు లాల్చీ. అదేరంగు పంచ. గిరజాల జుట్టు. నల్ల కళ్ళజోడు. పొడవాటి గెడ్డం ... యివన్నీ ఉండటం వల్ల అతను కొట్టవచ్చినట్లు ప్రత్యేకంగా కనపడుతున్నాడు అంతేకాదు. ఏదో అసహజత్వం.........కొన్నిచోట్ల ఆస్తి, పెద్ద బొజ్జ సంపాదించిన హీరో ఆకలికి అల్లల్లాడే పేదవాడి పాత్ర ధరించినట్టు.... కృత్రిమత్వం.... అదీ అతనివంక యింకోసారి చూసేటట్లు చేస్తున్నది.

"కలకత్తా రామ్‌ప్యారీ ... ఆరు ప్యాక్ చెయ్యి!"

శాపతనికి ఆ ఆర్డర్ చిరపరిచితమే! రోజూ సాయంకాలం ఎదురింట్లోని చిదంబరరావు ఆరు కిళ్ళీలు తీసుకువెడతాడు. అదీ కలకత్తా రామ్‌ప్యారీనే! శాపతను మళ్ళీ అతని వంక చూశాడు. దగ్గిర నుండి చూస్తుంటే ఆ గెడ్డం పెట్టుడు గెడ్డంలా అదోలా. గ్రీన్‌రూంలో డ్రామా యాక్టర్‌ని చూస్తున్నట్లు అనిపించింది. దొంగ సాధువో, నిజం సాధువో అని అనుకుని నవ్వుకుంటూ పాన్‌లు కట్టడం ప్రారంభించాడు.

"టైం ఎంతయ్యింది?" సాధువు అడిగాడు.

"అయిదుంపావు"

"ఎంత?" మళ్ళీ అడిగాడు. ఈసారి కొంచెం గట్టిగా చెప్పాడు శాపతను. పాన్‌లు తీసుకుని పక్కజేబులో పెట్టుకుని అయిదు రూపాయల నోటు యిచ్చి కదిలాడు సాధువు. "సామీ! చిల్లర తీసుకోలేదు!" అని శాపతను పిలవటంతో వెనక్కి వచ్చి "ఆలోచనలలో మరిచిపోయాను" అంటూ నవ్వాడు సాధువు. అలా నవ్వినప్పుడు గుబురు మీసాల చాటున, విడీవిడని పెదవుల వెనక పై వరుసలో బంగారపు పన్ను తళుక్కుమంది. శాపతను నిర్ఘాంతపోయాడు ....'చిదంబరరావు.... అతను చిదంబరరావుకి యిలాగే బంగారపు పన్ను వుంది. అంటే ఇతను మారువేషంలో ఉన్న చిదంబరరావా?'

అతను తేరుకునేటప్పటికి సాధువు పక్కగా ఉన్న టాక్సీ స్టాండ్‌ని చేరాడు. కొట్టు దిగి వెళ్ళి సాధువును పరీక్షగా చూద్దామనుకున్నాడు శాపతను. ఈలోగా సాధువు ఓ టాక్సీ ఎక్కటం, అది కదలటం జరిగాయి. కదులుతున్న టాక్సీలోంచి వెనక్కి తిరిగి చూశాడు సాధువు. లిప్తపాటు కనబడ్డ అతనిలో ఈసారి చిదంబరరావు పోలికలు ప్రస్ఫుటంగా కనబడినట్లు అనిపించింది శాపతనికి. అది నిజమా? లేక తన భ్రమా?.... అంత పెద్ద మనిషీ యూనివర్సిటీలో ప్రొఫెసరూ అలా మారువేషంలో ఎందుకు తిరుగుతాడు? మరి ఆ పోలికలు? భుజాలు ఎగరవేసి తన పనిలో పడ్డాడు శాపతను.

* * *

సికింద్రాబాద్ స్టేషన్ ముందు ఆగింది టాక్సీ. కానీ సాధువు దిగలేదు. "టాక్సీ నీ స్వంతమేనా?" అడిగాడు. డ్రైవర్ తల వూపాడు.

"రేపు సాయంకాలం వరకూ నాతో తిరుగుతావా? టాక్సీకి. నీకూ తిండి పెట్టిస్తాను. పైన అయిదువందలు యిస్తాను" అన్నాడు సాధువు. ఓ క్షణం అయ్యాక అన్నాడు,




"ఏ విధమైన కిరికిరి వుండదు!"

డ్రైవర్ తటపటాయించాడు.

"పోన్లే ఆరు వందలు!"

ఇంకొంచెం సేపు తటపటాయిస్తే యింకా లాభిస్తుందేమో అన్నట్లు డ్రైవర్ అతని వంకే చూస్తూ ఉండిపోయాడు. అతడు దిగటానికి ప్రయత్నించటం చూసి కంగారుగా "సరే సార్!" అన్నాడు డ్రైవర్.

"మంచిది!" అంటూ నవ్వాడు అతను బంగారపు పన్ను తళుక్కుమంటుండగా. అతని చేతిలో నాలుగు వంద నోట్లు ప్రత్యక్షమయ్యాయి. డ్రైవర్‌కి అవి యిస్తూ అన్నాడు. "మిగిలింది తర్వాత!"

"ముందుగా ఎక్కడికి పోదాం సార్?"

"కరీంనగర్!" క్లుప్తంగా అన్నాడు సాధువు.

"కరీంనగరా!" అదిరిపడ్డాడు డ్రైవర్ "పర్మిట్...."

"ఏడు వందలు"

టాక్సీ కదిలింది.

*     *     *

"ఇంకా పన్నెండు కిలోమీటర్లుంది కరీంనగర్" అన్నాడు సాధువు- వేగంగా వెనక్కి పరిగెత్తిన కిలోమీటరు రాయిని చూసి. మర్యాదకోసం తల ఊపాడు డ్రైవర్.

"ఒక్కసారిగా ఐదు లక్షలు దొరికిన వాడికంటే ఎక్కువగా సంతోషించేవాడు ఎవరో తెలుసా?" సాధువు అడిగాడు.

"ఎవరు స్వామీ ఆరులక్షలు దొరికినవాడా?"

సాధువు పగలబడి నవ్వాడు. "బాగానే చెప్పావుగాని తప్పు! యాభై ఏళ్ళ బ్రహ్మచర్యం తరువాత ఓ అందాల రాశిని పెళ్ళాడేవాడు. తెలిసిందా?" మళ్ళీ నవ్వసాగాడు.

"మీ వయస్సు యాభయ్యా?" అన్న ప్రశ్న డ్రైవర్ నోటి చివరికి వచ్చి ఆగిపోయింది. మ్యాక్రి లూక్ స్వామీజీ లాగా ఉన్నాడే అనుకున్నాడు డ్రైవర్. లేకపోతే ... ప్రెగ్నాపూర్‌లో టిఫిన్ తినమని యాభై రూపాయల నోటు యిచ్చాడు ... సిద్దిపేటలో టీ తాగమని యిరవై రూపాయల నోటు యిచ్చాడు.... కరీంనగర్‌లో భోజనం చెయ్యమని వందనోటు యిస్తాడేమో!- డ్రైవర్ నవ్వుకున్నాడు. విచిత్రం ఏమిటంటే తను మాత్రం ఏమీ తినకుండా తాగకుండా టాక్సీ కూడా దిగకుండా అలాగే వుండిపోయాడు- ఏమనుకోవాలి!

"ఓ నిముషం టాక్సీ ఆపు నాయనా!" అన్నాడు సాధువు.

రోడ్డు పక్కగా ఆగింది టాక్సీ. "అక్కడ ఆ పక్కన కొంచెం దూరంలో లైట్లు కనిపిస్తున్నాయి చూశావా.... అది మానేరు డ్యాం కాలనీ! తెలిసిందా?" అసంగతంగా అడిగాడు.

"అలాగా!" అన్నాడు డ్రైవర్ సాధ్యమైనంత వినయంగా. పెళ్లిలో అరుంధతి నక్షత్రం చూపించినప్పుడు కూడా అతను అదే విధంగా 'అలాగా' అన్నాడు.

"ఇప్పుడు టైం ఎంత?"

అగ్గిపుల్ల వెలిగించి చూసి చెప్పాడు డ్రైవర్ "తొమ్మిదీ పది!"

"సరిగ్గా చూడు నాయనా!"

ఇంకో అగ్గిపుల్ల వెలిగించాడు డ్రైవర్. "కరక్టే స్వామీ! తొమ్మిదీ పది!"

"అయితే ఆ పని వెంటనే చేయాలి!"

"ఏ పని స్వామీ!"

"ఏ పనా?" అంటూ చిటికెన వేలు తప్ప మిగిలిన అన్ని వేళ్ళూ మడిచి చూపించి పెద్ద జోకు వేసినట్లు గలగలా నవ్వి. రోడ్డు పక్కకి నడిచాడు సాధువు. ఇంకో రెండు క్షణాలలో చెట్ల మాటున చీకటి చాటున చూపుకి అందకుండా కరిగిపోయాడు.

సిగరెట్ వెలిగించాడు డ్రైవర్. చుట్టూ చీకటిగా ఉంది. ఆకాశం నిర్మలంగానే ఉంది. పడుకోబెట్టబడిన శవంలా ఓ మేఘం ఒక మూల పడుకుని ఉంది. చందమామ లేకపోవడంతో చుక్కలన్నీ శవం చుట్టూ కూర్చుని ఏడిచేవాళ్ళ కళ్ళలా వెలా తెలా పోతున్నాయి. కీచురాయి రొద. ఎక్కడో దూరంగా లారీనో బస్సో వెడుతున్న శబ్దం కూడా ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని భగ్న పర్చలేకపోతున్నాయి.

ఒక్కసారిగా చలిగాలి వీచింది! చెట్ల ఆకులు జలజల శబ్దం చేశాయి. ఓ క్షణం డ్రైవర్ గజగజలాడాడు. సిగరెట్ నిప్పు చెల్లాచెదురై షర్టుమీద పడటంతో "దీనవ్వ!"అనుకుంటూ షర్టును దులుపుకున్నాడు.

అప్పుడు వినిపించింది "అమ్మో!" అన్న సాధువు గొంతు! .. .... అది సాధువు గొంతే! .... అమ్మో అన్నది సాయం కోసం అరచినదో. బాధతో అన్నదో మొత్తం మీద ఆర్తనాదం.... ఏ విధమైన అనుమానం లేదు. ఏమైందా అన్న ఆదుర్దా గుడ్డిగా అలా చీకట్లో పరిగెత్తరాదన్న విచక్షణా జ్ఞానాన్ని తొక్కిపెట్టటంతో మరుక్షణం అతను గుబురుగా ఉన్న చెట్ల వెనక్కి చేరాడు. 'ఏం చెయ్యాలా?' అన్న ఆలోచన బహుశా అతనికి రాకముందే వెనకనుంచి తల మీద బలంగా రాతిదెబ్బ తగలటంతో నేలమీదకి జారిపోయాడు.

* * * *

తెలివి వచ్చేటప్పటికి అతను టాక్సీలో స్టీరింగ్ వీలు మీద వాలిపోయి వున్నాడు.తలలో ...ముక్కలయిపోతున్న తనతలలో- రెండు రోడ్ రోలర్లు నడుస్తున్నంత రొద. ఓ అరడజను టీములు ఇనుపముళ్ల బూట్లు ధరించి ఫుట్ బాల్ ఆడుతున్నంత బాధ.... తల విదిలించి వెనక్కి చూశాడు. చీకటి వల్లనో, తన కళ్లు మండుతూ వుండటంవల్లనో సరిగ్గా కనబడలేదు. అగ్గిపుల్ల గీసి చూశాడు-సాధువు సీటుమీద వాలిపోయి వున్నాడు....పంచె అస్తవ్యస్తంగా వుంది .... కళ్లజోడు ముక్కుమీదకి జారిపోయి వుంది ... "స్వామీ!" అంటూ పిలుస్తూ వెలుతురుని సాధువు మొహం దగ్గరికి చేర్చాడు. చెదురు మదురైన గెడ్డం, మీసాలు పెట్టుడువని తెలుస్తూనే ఉన్నాయి....నోటి కొసల నుంచి కిందకి జారుతున్న నల్లటి గీత.... గీత కాదు గడ్డకట్టిన రక్తం. అతని మొద్దుబారిన మెదడుకి కూడా తెలిసిపోయింది-ఆ సాధువు... దొంగ సాధువో.... నకిలీ సాధువో....చచ్చిపోయాడు....కాదు చంపబడ్డాడు.

అగ్గిపుల్ల చివరికంటా మండి చర్మాన్ని కాలుస్తున్నా అతను కదలలేదు....కాదు కదలలేక పోయాడు.

## 2


"ఎవరు ఇన్‌స్పెక్టర్.... ఎవరు మామయ్యను చంపారు? ఎవరైనా ఎందుకు చంపాల్సి వచ్చింది?" సురేష్ అడిగాడు.

ఇన్‌స్పెక్టర్ కృష్ణ మెల్లిగా చెప్పసాగాడు. "నిన్న సాయంకాలం అయిదుగంటల పదిహేను నిముషాలకి మీ యింటి నుంచి మీ మావయ్య చిదంబరరావుగారు బయల్దేరారు—అదీ మారువేషంలో! మీ యింటి ఎదురుగా వున్న పాన్‌షాపతనికి ఆ వేషంలో వున్నది చిదంబరరావుగారే అని అప్పుడే అనుమానం వచ్చిందిట. ఆ తరువాత ఆయన టాక్సీలో ...." అంటూ జరిగిన గంతా చెప్పాడు. "టాక్సీ డ్రైవర్ వెంటనే కరీంనగర్ వెళ్ళి పోలీస్ రిపోర్టు యిచ్చాడు. మీ మామయ్య లాల్చీ జేబులో డ్రైవింగ్ లైసెన్సు ఉండటంతో అక్కడ వాళ్ళు వెంటనే హతుడెవరో నిర్ధారించి యిక్కడ మాకు తెలియపరిచారు.... ఆయన్ని గొంతు నులిమి చంపారు.హత్య ఎనిమిదిగంటల నుండి పదిగంటలలోపు జరిగివుండాలి అని పోస్టుమార్టం చేసిన పెథాలజిస్టు అభిప్రాయం. కాని తొమ్మిదీ పది వరకూ డ్రైవర్ ఆయన్ని చూస్తూనే వున్నాడు— కాబట్టి హత్య తొమ్మిదీ పదికి దగ్గర్లో ఎంత లేదన్నా పదిలోగా జరిగిందన్నమాట.... టాక్సీలో వేలి ముద్రలు కనబడకుండా శుభ్రంగా తుడిచి వేశారు." ఊపిరి పీల్చుకునేందుకు ఓ క్షణం ఆగాడు. "అర్థంకాని విషయాలు చాలా వున్నా మరీ పజ్లింగ్‌గా వున్న విషయం ఆయన మారువేషంలో వెళ్ళటం.... ఈ వింత ప్రవర్తనకి కారణం మీరు చెప్పగలరా?"

"వింత ప్రవర్తన అంటే మామయ్యకి పిచ్చి.... అదే మతి స్థిమితం లేదని...."

సురేష్ మాటలు పూర్తికానీయలేదు కృష్ణ "నేనాయన ఓల్డు స్టూడెంట్‌ని. ఆయన గురించి నాకు కొద్దో గొప్పో తెలుసు ... నా అభిప్రాయం అది కాదు. గత కొన్నిరోజులుగా.... అంటే అయిదారునెలలుగా ఆయనలో ఏమన్నా అలజడిగాని...." అర్థయుక్తంగా అర్థోక్తిగా ఆపాడు.

"నాకా విషయం తెలీదు" అన్నాడు కృష్ణ "ఐమీన్.... అదే మీరు ఆయన స్టూడెంట్ అని ...ఇకపోతే అలజడి అంటే.. .... ఓ మై గుడ్‌నెస్! ... ఇప్పుడు గుర్తుకు వస్తున్నది ఇన్‌స్పెక్టర్! చెబుతాను" ఓ క్షణం కళ్ళు మూసుకున్నాడు సురేష్. జ్ఞాపకాల పొరల్లో ఎక్కడో దాగిన విషయాన్ని సుతారంగా



బయటకి తీస్తున్నట్టు మెల్లిగా చెప్పసాగాడు. "క్రితం నెల చివర్లో .... అదే జులై ముప్పైఒకటిన.... మా స్నేహితుడు మినార్లో బొంబాయి వెడుతుంటే సెండాఫ్ యిచ్చి సికింద్రాబాద్ స్టేషన్ బయటికి వస్తున్నాను....ప్లాట్‌ఫాం మీద మామయ్య కనపడ్డాడు.. ఆవిడతో మాట్లాడుతూ... ఆవిడకి నలభైలోపు వయసు ఉంటుంది. కాని విపరీతంగా మరీ విచ్చలవిడిగా ఫాషనబుల్‌గా అలంకరించుకుంది. ఇద్దరూ చాలా దగ్గరగా కూర్చున్నారు.... నన్ను మామయ్య గమనించలేదు... 'మానేరు డ్యామ్ కదూ గుర్తుంటుంది' అంటున్నాడు ఆవిడ చేయి నిమురుతూ....."

చిదంబరరావు గదిలో వెతుకుతుంటే దొరికిన కాయితాలు గుర్తుకు వచ్చాయి కృష్ణకి. ఎడమ చేతితోనో కాలితోనో వ్రాసినట్లు వంకరటింకర అక్షరాలున్నాయి వాటిమీద. మొదటి దానిలో "ముప్పైఒకటి సాయంకాలం సికింద్రాబాద్ స్టేషన్లో" అని, రెండోదానిలో "పదోతారీకు రాత్రి మానేరుడ్యామ్‌లో...." అని ఉన్నాయి.

"....మీకు తెలిసే వుంటుంది మామయ్య పెళ్ళి చేసుకోలేదని. అటువంటి వాడ్ని అలా చూసినప్పుడు ఏదోలా అనిపించి వెనక్కి తిరిగి వచ్చేశాను. తర్వాత ఆ విషయం మరిచిపోయాను కూడా!"

"ఆవిడని అంతకుముందు ఎప్పుడన్నా చూశారా? పార్టీల్లో గాని....యూనివర్సిటీలో గాని....!"

"లేదు యిన్‌స్పెక్టర్! అదే మొదటి సారి చివరి సారి కూడా!"

"ఆయన ఆస్తికి మీరే వారసులనుకుంటాను" హఠాత్తుగా అడిగాడు.

ఆక్వర్డ్‌గా తల ఊపాడు సురేష్ "నన్ను దత్తత తీసుకున్నాడు!"

"ఏమాత్రం ఉంటుంది ఆస్తి?"

"...అంతా కలిపి అయిదారు లక్షలు...."

వినీ విననట్లు అడిగాడు యిన్‌స్పెక్టర్ "మీకు గుర్రప్పందాలు అదే అలవాటు...." సురేష్‌కి చర్రున కోపం వచ్చింది. "అంతేగాదు పేకాట కూడా ఆడతాను. ఈమధ్య పెద్దమొత్తంలోనే డబ్బు పోగొట్టుకున్నాను. అయినా నేను ఉద్యోగస్థుడ్ని. ఎక్కడో సర్దుబాటు చేసుకోగలనుగాని దానికోసం మామయ్యను చంపాల్సిన అవసరం లేదు. పైగా నిన్న రాత్రంతా యిక్కడే వున్నాను."

ఇన్‌స్పెక్టర్ తల ఊపాడు! అతనికి తెలుసు. క్రితం రోజు సాయంకాలం ఆరుగంటలనుంచి తొమ్మిది గంటలవరకూ సురేష్ సినిమా హాలులో ఉన్నాడు. ఏ.సి సరిగ్గా ఆన్ చేయలేదని సినిమా జరుగుతుండగా నాలుగయిదుసార్లు చివరికి సినిమా అయిపోయాక ఓ పావుగంట సేపు మేనేజరుతో పోట్లాడాడు అతను. దాంతో మేనేజరే కాక యింకా యిద్దరు ఉద్యోగులు అతనా సమయంలో సినిమాహాలులో ఉన్నాడని గట్టిగా చెబుతున్నారు. ఇక అరగంట సమయంలో నూటయాభై కిలోమీటర్లు వెళ్ళి సురేష్ ఆ హత్య చేయగలగటం అసంభవం. పైగా చిదంబరరావు ఫలానా ప్రదేశంలో ఉంటాడని సురేష్‌కి ఎలా తెలుస్తుంది? తల విదిలించాడు ఇన్‌స్పెక్టర్. "మీతోపాటు మీ స్నేహితుడు సినిమా చూశాడు కదా?"

"....యింతకు ముందు రెండుసార్లు చెప్పాను. అతని పేరు రఘు. ఈ రోజున ఊళ్ళో లేడు. యాదగిరి గుట్టకి వెళ్ళాడు."

సినిమా హాలు మేనేజరు కూడా చెప్పాడు. సురేష్ పక్కన ఎవరో వున్నారని, సరిగ్గా గమనించలేదని. సురేష్ పక్కన వున్నది రఘునే అని నిర్ధారించుకుంటే సురేష్ నూటికి నూరు పాళ్ళు నిజం చెబుతున్నాడని నమ్మవచ్చు. ఆలోచనలు ఆపి యధాలాపంగా అడిగాడు "అతనికి మొక్కుబడి లాంటిది ఏమైనా వుందా? అంటే గుండు.... ఐమీన్.... తల నీలాలు?"

"అవును!"

ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లు అదిరిపడ్డాడు ఇన్‌స్పెక్టర్. అతనికి ఏదో వాసన వేసినట్లనిపించింది. రుమాలుతో మొహం తుడుచుకుని రెండుసార్లు గట్టిగా గాలి పీల్చి వదిలాడు. "థాంక్యూ వెరీ మచ్! తొందర్లో మిమ్మల్ని కలుస్తాను!" అంటూ బయటకి కదిలాడు.

అబద్ధాన్ని గురించి నాలుగుమాటలు చెప్పమంటే ఎవరైనా రసాయన శాస్త్రజ్ఞుడు బహుశా ఈ విధంగా చెప్పొచ్చు- 'అందరి నోళ్ళల్లోనూ నానుతూనే వుంటుందిగాని దానికి రంగు, రుచి, వాసన, ఆకారం లేదు' అని. కాని మోసాలలో నేరాలలో న్యాయ అన్యాయాలలో యిరవై నాలుగు గంటలు గడిపే ఇన్‌స్పెక్టర్ కృష్ణలాంటివాళ్ళు అబద్ధం గాలిలోకి ప్రవేశిస్తే వాసన పట్టగలరు.


పాఠాలు చక్కగా చెప్పేవాళ్ళు మంచి మేష్టార్లయితే పాఠాలు చక్కగా చెబుతూ ఎవర్నీ నొప్పించకుండా అందర్నీ ఆకట్టుకునే వాళ్ళు చిదంబరరావు లాగా గొప్ప మేష్టార్లు. అందుకనే కృష్ణకి చిదంబరరావు అంటే ఎంతో గౌరవం ఉంది. అందుకనే చిదంబరరావుని చంపినవాళ్ళని పట్టుకోవాలని తద్వారా గురురుణం తీర్చుకోవాలని కృష్ణ ఆశయం.

తనకి తెలిసిన ప్రతి చిన్న విషయాన్ని కూర్చి క్రోడీకరించి మళ్ళీ యింకోసారి సమీక్షించుకున్నాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణ.

'ఎప్పుడూ నాటకాలలో వేషం కూడా వేసి ఎరగని ఆయన చివరిరోజున గెడ్డం మీసం ఎందుకు తగిలించుకోవాల్సివచ్చింది? ఇది తెలిస్తే బహుశా హత్య ఎందుకు ఎవరు ఎలా చేశారో తెలిసిపోతోంది. కాబట్టి యిది కీలకమైన అంతుపట్టని సమస్య.

'చిదంబరరావు హత్య హైదరాబాద్‌కి నూట యాభై కిలోమీటర్ల దూరంలో జరిగింది. హత్య చేయడానికి మోటివ్ వున్న సురేష్‌కి బలమైన ఎలిబీవుంది. పోనీ యింకెవరిచేతనయినా చేయించాడేమో అనుకుంటే చిదంబరరావు తన చిత్తం వచ్చినచోట టాక్సీ ఆపించాడు కదా! ఆ ఫలానా ప్రదేశంలో కాపు వేయాలని ఎవరికి ముందుగానే ఎలా తెలుస్తుంది? ఇది ప్రస్తుతానికి అర్థం కానివిషయం.

'చిదంబర రావుకి ఏ విధమైన దురలవాట్లు లేవు. స్త్రీ వ్యామోహం ఉన్నట్లు దాఖలాలు లేవు. ఈ విషయంలో యిరుగు పొరుగు వాళ్ళు, స్నేహితులు, విద్యార్థినులు అతనికి క్లీన్ సర్టిఫికేట్ యిచ్చారు. ఒక్క సురేష్ చెప్పిన విషయమే యిందుకు వ్యతిరేకంగాఉంది. కాదు.... అదొక్కటే కాదు. టాక్సీలో చిదంబర రావు యాభైఏళ్ళ బ్రహ్మచర్యం తరువాత పెళ్ళాడటం గురించి మాట్లాడాడు కదా!.... అవును. అయితే యివి పరస్పర



విరుద్ధంగా ఉన్న విషయాలు....

'టోపీలేని నెహ్రూ బొమ్మ నాణాలమీద ముద్రించినపుడు చాలామంది ఆ బొమ్మను గుర్తించలేకపోయారు. నిజమే! మనకి బాగా తెలిసినవారే గుండుతో ప్రత్యక్షమయితే వెంటనే వారిని గుర్తుపట్టటం కష్టం. రఘు విషయంలో కూడా యిలాగే ఉంది పరిస్థితి. ఆరోజున సురేష్ పక్కన ఉన్నది రఘునేనా అన్న ప్రశ్నకి ఖచ్చితంగా సమాధానం చెప్పలేకపోతున్నారు మేనేజరు, ఇతరులు—రఘు తన తల నీలాలు యాదగిరిగుట్టలో సమర్పించి రావటంతో. ఇందులో వాళ్ళని తప్పుపట్టలేం! కాని.... యిది తరచి తరచి ఆలోచించినా ప్రయోజనంలేని విషయం. నో.... నో.... ఈ విషయంలోనే తనకి మొదటిసారిగా సురేష్ మీదుగా అనుమానం వచ్చింది. సురేష్ అంతా నిజమే చెప్పటంలేదు ... అది ఖాయం.... కాని ఏ విషయంలో అబద్ధం చెబుతున్నట్లు! ఆ రోజున సురేష్ పక్కన ఉన్నది రఘు కాదా? రఘు వెళ్ళి హత్య చేశాడా? ఎలా చేయగలడు? చిదంబరరావు ఎక్కడ చిక్కుతాడో అతనికి ఎలా తెలుసు? ఇది మళ్ళీ మళ్ళీ ఎదురవుతున్న చిక్కు ప్రశ్న.

'చిదంబరరావు టాక్సీలో మాట్లాడిన మాటలు బట్టి ఆ వయ్యారి వగలాడి గురించి సురేష్ నిజమే చెప్పి ఉండాలి. ఓకే! సురేష్ నిజమే చెప్పాడు. ఆవిడని కలవటానికే చిదంబరరావు కరీంనగర్ వెళ్ళాడు అనుకుందాం! అప్పుడు ఆ హత్య చేసింది ఆ వగలమారివయ్యారే అనుకోవచ్చు. మరిమారు వేషంలో ఎందుకు వెళ్ళినట్లు? నిగూఢంగా వెళ్ళాలనా? అవసరం ఏమిటి? ఒకవేళ అంత రహస్యంగా వెళదామనుకున్నవాడు తను రోజూ పాన్ తీసుకునే షాపుకి వెళ్ళటంలోని ఉద్దేశ్యం ఏమిటి? తన మారు వేషం బట్టబయలు అయ్యే అవకాశం ఉంది కదా? పాన్ షాపులో తను మామూలుగా తినే పాన్‌లనే ...పాన్‌లనే.... పాన్ ...'

ఇన్‌స్పెక్టర్ కృష్ణకి ఏదో వాసన వేసినట్లనిపించింది. రుమాలుతో మొహం తుడుచుకుని రెండుసార్లు గాఢంగా ఊపిరి పీల్చి వదిలాడు.

"ఏమిటి యిన్‌స్పెక్టర్ రమ్మన్నారుట?" సురేష్ అడిగాడు. అతనితోపాటు రఘు కూడా ఉన్నాడు.

"కూర్చోండి" అన్నాడు కృష్ణ. "మీకు రెండు విషయాలు చెబుదామని పిలిచాను. ఒకటి గుడ్‌న్యూస్. రెండోది బ్యాడ్ న్యూస్."

"ఏమిటవి?" కుతూహలంగా అడిగాడు సురేష్.

"ముందుగా గుడ్ న్యూస్! చిదంబరరావుగారిని చంపిన దెవరో తెల్సిపోయింది. ఇప్పుడు బ్యాడ్‌న్యూస్.... హత్యచేసింది మీరే!"

ఒక్క ఉదుటున కుర్చీ వెనక్కితోసి లేచాడు కృష్ణ. "మీరేం మాట్లాడుతున్నారు యిన్‌స్పెక్టర్? హత్య జరిగిన టైంలో నేను హైదరాబాద్‌లో వున్నాను....."

వెన్నని కోసే కత్తిలా సునాయాసంగా ఆపుచేసింది సురేష్ మాటలను ఇన్‌స్పెక్టర్ గొంతు "హత్య కూడా హైదరాబాద్‌లోనే జరిగింది కదా?"

సురేష్ మొహం వివర్ణమైంది. ఇన్‌స్పెక్టర్ అతన్ని పొట్టలో తన్నలేదుగాని తన్నినట్లే కుర్చీలో కూలబడ్డాడు అప్రయత్నంగా. "మీరు.... మీరు...." అంటూ గొణగ సాగాడు. రఘుకి సన్నగా చెమట్లు పట్టసాగాయి.

ఇన్‌స్పెక్టర్ తనలో తాను నవ్వుకున్నాడు. అతనికి తెలిసిన సమాచారం కొంత, ఊహించినది కొంతంత. తన ఊహ అటూ యిటూ అవటానికి అవకాశం వుంది కూడా! కానీ మొదటి దెబ్బ తగలాల్సినచోట తగిలింది— అదీ బలంగా! "నాకు అంతా తెలుసు సురేష్-ఒప్పేసుకోండి."


# 107 స్పెషల్ డిటర్జెంట్ బార్.

## ఇది యిచ్చే ఎక్కువ తెల్లదనానికి కారణం? దీనిలో వున్నది-'గుట్టుగా' తెల్లపరిచే పదార్థం!




107 స్పెషల్ డిటర్జెంట్ బార్ సోపులోనే వుంది ప్రత్యేక తెల్లదనం యిచ్చే సీక్రెట్ ఏజెంటు. అధికమైన తెలుపుకీ మెరుపుకీ ఇదే కారణం.

ఒత్తుగా వచ్చే నురగలు మురికిని వదలగొడతాయి. అంతేకాదు - యీ బార్ సోపు మంచి అదా కూడా.

ఉత్పత్తిదారులు :
అల్ట్రా మరైన్ అండ్ పిగ్‌మెంట్సు లిమిటెడ్
రాణిపేట-632 403

Sista s/ULP/25/84




మనిషి ఆశాజీవి. లేకపోతే రేసులకి అంతమంది వెళ్ళరు. లాటరీ టిక్కెట్ల అమ్మకం కొన్ని మందుల అమ్మకాన్ని తలదన్నేటట్లు వుండేవి కాదు. "మరి బుజువులు...." అంటూ గొణగగలిగాడు సురేష్. బలంగా భుజంమీద చేయివేస్తే పడిపోయే శవంలా అయ్యాడు రఘు.

"చాలా మంచి ప్లాన్ వేశారు సురేష్. హైదరాబాద్‌లో జరిగిన హత్యని కరీంనగర్ దగ్గర జరిగిందనుకునేటట్లు చేశారు మీ మేధస్సుని ఉపయోగించి. దాంతో నువ్వీ హత్య చెయ్యలేదు. చెయ్యలేవు అన్న అభిప్రాయాన్ని కలిగించావు. నిజంగా చాలా పకడ్బందీగా వేశారు ప్లాన్. మీరు తీసుకున్న కొన్ని జాగ్రత్తలు తలచుకుంటే ఎంతో అనుభవమున్నవారు చేశారా అనిపిస్తున్నది. ఉదాహరణకి కరీంనగర్ ప్రయాణంలో రఘు ఏమీ తినకపోవటం తాగకపోవటం...."

సురేష్ గొణగటం మాని వణకటం ప్రారంభించాడు. అంతవరకూ ఊపిరిపీలుస్తున్న శవంలా వున్న రఘు. అది కూడా మాని కళ్ళూ నోరూ తెరిచిన శవంలా అయిపోయాడు.

రెండో దెబ్బ కూడా గురి తప్పనందుకు తనను తాను అభినందించుకున్నాడు ఇన్‌స్పెక్టర్. "నాకు అనుమానం ఎక్కడ వచ్చిందంటే కిళ్ళీలు కొన్న చిదంబరరావు వాటిని తినకపోవటంతో. శవపరీక్షలో వాటిని తిన్న ఛాయలు కనబడలేదు. ఇటు జేబులోనూ లేవు. మరి కిళ్ళీలు ఎందుకు కొన్నట్లు? పాన్ షాపులో రెండుసార్లు టైం ఎందుకు అడిగినట్లు? టాక్సీడ్రైవర్‌ని తొమ్మిది పదేనా అని పదే పదే ఎందుకు అడిగినట్లు?" ప్రమైజ్ చేయటానికి అన్నట్లు ఆగాడు కృష్ణ. 'ఆ అవసరం లేదు. ఇక బేడీలు వేసుకోవటమే తరువాయి' అన్నట్లు చేతులు రెండూ దగ్గరికి చేర్చాడు సురేష్. 'ఇక మిగిలింది యింతే... శూన్యం!' అన్నట్లు గుండు నిమురుకోసాగాడు రఘు "గడ్డం. మీసం. గిరజాలజుట్టు తగిలించుకుని చూసేంగానే ఆకర్షించే విధంగా కాషాయ వస్త్రాలు ధరించి, చిదంబరరావా అన్న అనుమానం రావటానికి బంగారపు రంగు కాయితాన్ని పంటికి తగిలించుకుని కరీంనగర్ బయల్దేరాడు రఘు. ముందుగా అనుకున్న సమయానికి టాక్సీ ఆపించి స్పృహ పోగొట్టాడు. ఇక్కడ నువ్వేమో ఇంకెవరితోనో సినిమాకి వెళ్ళి అనవసరంగా... సారీ.. అత్యవసరంగా మేనేజరుతో పోట్లాడి ఎలిబీ సంపాదించావు. సినిమా అయిపోయాక యింటికి వెళ్ళి అంతవరకు బహుశా బంధింపబడ్డ చిదంబరరావుగారిని చంపావు. అవునా? ఆ తరువాత కారులో ఆ శవాన్ని కరీంనగర్ తీసుకువెళ్ళి మానేర్ డ్యామ్ కాలనీ వద్ద రఘుని కలిసి శవానికి గెడ్డం, మీసం తగిలించి. లాల్చీ పంచ తొడిగి యిద్దరూ వెనక్కి వచ్చేశారు. స్పృహ వచ్చాక డ్రైవర్ శవాన్ని చూసి తనతో వచ్చిన సాధువే చంపబడ్డాడని పొరబడ్డాడు". ఊపిరి పీల్చుకోవటానికి ఆగాడు ఇన్‌స్పెక్టర్. "మధ్యదారిలో రఘు ఏమన్నా తిన్నా తాగినా. తరువాత హతుడి పోస్ట్‌మార్టం రిపోర్టులో ఆయా పదార్థాలు కనబడకపోతే అసలు సంగతి బట్టబయలు అవుతుందని అతితెలివితో పాన్‌లు కూడా తినలేదు రఘు. అదే మిమ్మల్ని పట్టిచ్చింది!"

మనిషి ఆశాజీవే కాదు మొండివాడు కూడా. లేకపోతే రెండు ప్రపంచ యుద్ధాలు అయ్యాక కూడా రెండు వందల ప్రపంచ యుద్ధాలకి సరిపోయే ఆయుధ సామాగ్రి సమకూర్చుకునే వాడుకాదు. "యివన్నీ మీరు ఎలా నిరూపించగలరు? ఆధారాలు ఏమున్నాయి?" అడిగాడు సురేష్. కానయితే చిన్నప్పుడు మాట పోయి చివరి రీలులో మాటలు వచ్చిన సినిమా హీరోలా ఒత్తి ఒత్తి పలికాడు.

"ఆధారాలా?" నవ్వాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణ! "జులై ముప్పై ఒకటిన మినార్ ఎక్స్‌ప్రెస్‌లో మీ స్నేహితుడు బొంబాయి వెళ్ళాడన్నావు కదూ! ఆ రోజున బొంబాయికి ట్రెయిన్ నడవలేదు. అక్కడ విపరీతంగా వర్షాలు పడి ట్రాక్ బాగుండకపోవడం వల్ల!" టేబుల్ మీదవున్న తనటోపీ వంక చూసి కొనసాగించాడు. "ఇకపోతే టాక్సీ డ్రైవర్‌కి రఘు యిచ్చిన నోట్లమీద వేలిముద్రలు లభించాయి. ఈ రోజునే తెలిసింది ఆ విషయం. అవి రఘువి అని...."

ఇన్‌స్పెక్టర్ మాటలు పూర్తి కానీయలేదు సురేష్. "తప్పు ఒప్పుకుంటే శిక్ష తగ్గుతుందా?" అడిగాడు.

* * *

వ్యసనాలకి యిష్టం వచ్చినట్లు డబ్బు ఖర్చు పెట్టడంతో చిదంబరరావుకి కోపం వచ్చి తీవ్రంగా చివాట్లు పెట్టాడని. ఆస్తి దక్కదు అప్పులు తీరవని ఈ హత్య చేశానని సురేష్. అతనికి సాయపడ్డానని రఘు ఒప్పుకున్నారు. ఫార్మాలిటీస్ అయిపోయేటప్పటికి అరగంట పట్టింది.

"సురేష్! నీకు కృష్ణుడికి ఒక పోలిక వుంది. అతను జైల్లో పుట్టి మేనమామను చంపితే నువ్వు మేనమామను చంపి జైలుకి వెళుతున్నావు!" అన్నాడు కృష్ణ శ్రీకృష్ణ జన్మ స్థానానికి వెళుతున్న సురేష్‌తో.

ఆ తరువాత అతను స్టేషను బయటకి వచ్చి నుంచున్నాడు. స్కూలునుండి యింటికి గుంపులు గుంపులుగా వెళుతున్న పిల్లలు సంతోషంగా అడుగులు వేస్తున్నారు. వాళ్ళ సంబరానికి అడ్డు రాకూడదు అన్నట్లుగా సుతిమెత్తగాఎండ కాస్తున్నాడు సూర్యుడు. చల్లగా హాయిగా వీస్తున్న గాలి పిల్లల జుట్టు అల్లరిగా చెరిపివేస్తూ సాగుతున్నది. పిల్లల ఆనందం వాతావరణంలోనే కాదు తనలో కూడా ప్రతిఫలిస్తున్నది అనుకున్నాడు కృష్ణ.

సురేష్ అంత సులభంగా ఒప్పుకుంటాడని అనుకోలేదు కృష్ణ. ముప్పై ఒకటిన మినార్ బయల్దేరలేదని తెలియటం వల్లనా అతను సరెండర్ అయ్యింది? అతడు చేసిన చాలా చిన్న పొరపాటు ఆ అబద్ధం చెప్పటం. దాన్ని ఎలాగైనా సరిదిద్దుకోవచ్చు.

పోతే టాక్సీ డ్రైవర్‌కి రఘు యిచ్చిన నోట్లమీద రఘు వేలిముద్రలు దొరికాయని తను చెప్పటం వలనా? అవును కారణం నోటుమీద దొరికిన 'రఘు వేలిముద్రే'....!

ఇన్‌స్పెక్టర్‌కి ఏదో వాసన వేసినట్లనిపించింది. రుమాలుతో మొహంతుడుచుకుని రెండుసార్లు గాఢంగా ఊపిరి పీల్చి వదిలాడు. అబద్ధం ఎవరు చెప్పినా అబద్ధమే!